క్లుప్తంగా

నేటి నుంచి బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ



ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయదుర్గంటౌన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరి వీడాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. ఈ నెల 10వ తేదీ నుంచి బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాక్టో ప్రతినిధులు రామాంజనేయులు, హనుమంతరెడ్డి, అనిల్‌కుమార్, రవికుమార్ తదితరులు తెలిపారు. గురువారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఎంఈఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఖాశీంపీరా, నాగరాజు, సునీల్‌కుమార్, ఆంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ మండలంలో..

బొమ్మనహాళ్: రాష్ట్ర ఫ్యాప్టో కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మండల నాయకులు తెలిపారు. ఈమేరకు గురువారం వారు స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ–2 హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో నాయకులు యు.శ్రీనివాసులు, చెక్కే తిప్పేస్వామి, బి.తిప్పేస్వామి, హనుమంతునాయక్, సురేష్, ఓబుళపతి, వజీర్‌బాష, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి

కూడేరు: బ్రాహ్మణపల్లిలో సర్వే నంబర్ 93లో చెరువు పేరుతో ఉన్న 130 ఎకరాల భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కోశాధికారి రాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఆ భూమిలో పేదలతో కలిసి గుడిసెలు వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డైగ్లాట్‌లో ఇప్పటికీ చెరువు భూమి అనే చూపిస్తోందని, కొంత మంది తమ పలుకబడిని ఉపయోగించి ఆ భూమిని తమ పేరిట ఆన్‌లైన్లో ఎక్కించుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు శ్రోత్రియ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రోగులతో కిటకిటలాడిన పీహెచ్‌సీ



ఇంజెక్షన్ గది వద్ద వేచి ఉన్న రోగులు

కూడేరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) గురువారం రోగులతో కిటకిటలాడింది. మరుట్ల, కలగళ్ల, ఇప్పేరు, చోళసముద్రం, ముద్దలాపురం, కరుట్లపల్లితో పాటు మరికొన్ని గ్రామాల నుంచి ప్రజలు దగ్గు ,జలుబు, జ్వరం ,ఒళ్లునొప్పులు, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతూ వైద్యం కోసం క్యూ కట్టారు. వైద్యులు లేకపోవడంతో కింద స్థాయి సిబ్బంది వైద్య సేవలందించారు. దీంతో రోగులు తొందరగా వైద్య సేవలు పొందలేక పోయారు.

ఎలుగుబంటి సంచారంతో బెంబేలు



గుట్టపై నుంచి వస్తున్న ఎలుగుబంటి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ గుట్టపై ఎలుగుబంటి స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. గురువారం ఉదయం స్టేషన్ వైపు వాకింగ్‌కు వెళ్లిన స్థానికులు ఎలుగుబంటిని చూసి బెంబేలెత్తారు. రైల్వే ట్రాక్ సమీపంలో నివాసముంటున్న స్థానికులు, నర్సరీ నిర్వాహకులు, కురాకులతోటకు వెళ్లే వారు ఎలుగుబంట్ల సంచారంతో భయాందోళన చెందుతున్నారు.

సర్మస్ హుసేన్సీ దర్గాలో ప్రార్థనలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు.

కంపచెట్లు ఇలా.. నీరు పారేదెలా?



కూడేరు వద్ద కుడికాలువలో విపరీతంగా పెరిగిన కంపచెట్లు

కూడేరు: పీఏబీఆర్ నుంచి కుడి కాలువ ధర్మవరం వరకు 112 కిలో మీటర్లు ఉంది. ఈ కాలువ ద్వారా ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజక వర్గాల్లోని 49 చెరువులకు నీటిని నింపుతారు. పీఏబీఆర్‌లో ప్రస్తుతం 5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరి కొద్ది రోజుల్లో డ్యాం నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసే అవకాశాలున్నాయి. కానీ కుడి కాలువ పొడవునా అనేక ప్రాంతాల్లో కంపచెట్లు విపరీతంగా పెరిగి కాలువను కప్పేశాయి. నీటిని విడుదల చేసే సమయానికి కంపచెట్లు ఇలానే ఉంటే కాలువలో నీటి ప్రవాహం దిగువన ఉన్న చివరి చెరువు వరకు ముందుకు సాగడం కష్టతరమవుతుంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాలువలో పెరిగిన కంపచెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

మేదరు వీధిలో కంపు .. కంపు



కనీసం నడిచేందుకు కూడా వీలులేని విధంగా రోడ్డుపై మురుగు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 18వ వార్డులోని మేదరు వీధి దుర్గంధభరితంగా మారింది. పరిసరాలు కంపు కొడుతూ దుర్వాసనతో ప్రజలు సతమతమవుతున్న దుస్థితి నెలకొంది. డ్రైనేజీ నీరు ముందుకు సాగక రోడ్లపై పారుతూ పరిసరాలన్నీ కంపు.. కంపుగా మారాయి. మేదరు వీధి నుంచి వచ్చే డ్రైనేజీ నీరు సెయింట్ థామస్ స్కూల్ ముందు నుంచి మసీదు మార్గంలోని ప్రధాన డ్రైనేజీకి వెళ్లేవి. మూడు నెలల క్రితం కల్వర్టు వద్ద డ్రైనేజీ ధ్వంసం కావడంతో మురుగు రోడ్లపైనే నిల్వ ఉన్నట్లు కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది డ్రైనేజీని శుభ్రం చేయడం లేదని, ధ్వంసమైన డ్రైనేజీని సరిచేసి నీటిని డ్రైనేజీకి మళ్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

లక్ష్యం .. నిర్లక్ష్యం



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూలన పడేసిన మొక్కలు

బ్రహ్మసముద్రం: ఇటీవలే ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమంపై వివిధ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగానే ఇంటింటా మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారు కేంద్రాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అయితే ఆ కార్యక్రమాలన్నింటినీ అధికారులు తూ తూ మంత్రంగా చేపట్టారన్న విమర్శలున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ నర్సరీల నుంచి మండల స్థాయి అధికారులు మొక్కలు తెప్పించారు. అయితే దాదాపు 3 వేలకు పైగా మొక్కలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓ మూలన పడేశారు. కార్యాలయానికి వచ్చిన వారందరూ మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోరా.. అంటూ సిబ్బందిని ప్రశ్నిస్తున్నా అధికారులు, సిబ్బంది మాత్రం నిర్లక్ష్యాన్ని వీడటం లేదు.

అమలు కాని హామీలతో బాబు మోసం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ బొమ్మన్న

కళ్యాణదుర్గం: ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చి చంద్రబాబు ప్రజలను మోసం చేశారని జెడ్పీటీసీ బొమ్మన్న ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ ఎంపికల్లో భాగంగా పార్టీ మండల కన్వీనర్ గొల్ల సూరితో కలసి గురువారం కాపర్లపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరగాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన మంచిని వివరిస్తూ ఏడాదిలో చంద్రబాబు చేసిన మోసాలను, మేనిఫెస్టోను తెలియజేయాలన్నారు. అలాగే డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ గురించి వివరించారు. గ్రామ కమిటీల్లో పదవులు తీసుకున్న ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం పలు అనుబంధ సంఘాల గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, శివలింగారెడ్డి, రామంజినరెడ్డి, మధు, రామాంజి, ఎర్రిస్వామి, ఈరన్న, మాజీ డీలర్ బొమ్మన్న, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేలో నిల్.. బ్లాక్ మార్కెట్‌లో ఫుల్

- యూరియా పంపిణీపై మండల మీట్‌లో సభ్యుల ఆగ్రహం



యూరియా పంపిణీపై ఏఓ జగదీష్‌ను ప్రశ్నిస్తున్న సర్పంచు హనుమంతప్ప

కణేకల్లు: యూరియా పక్కదారి పట్టి బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుంటే నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూశారని సర్పంచులు, ఎంపీటీసీలు మండిపడ్డారు. యూరియా ఆర్‌ఎస్‌కేలో నిల్ స్టాక్... బ్లాక్ మార్కెట్‌లో ఫుల్ స్టాక్ ఉందన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వండ్రయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ లీలావతి, ఎంపీడీఓ చంద్రమౌళి, డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌తో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో యూరియా పంపిణీపై సభ్యులు నిప్పులు చెరిగారు. ఆర్‌ఎస్‌కేలో రూ.266 కు రైతులకు లభించాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్‌లో రూ.500, 600.. డిమాండ్ బట్టి రూ.800 వరకూ విక్రయించి నిలువుదోపిడీ చేశారని విమర్శించారు. ఆర్‌ఎస్‌కేలో నిల్ స్టాక్ ఉంటే... బ్లాక్ మార్కెట్‌లో ఫుల్ స్టాక్ ఉందంటే యూరియా స్కామ్ ఏ మేరకు జరిగిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదన్నారు. జక్కలవడికిలో యూరియా వస్తే రాత్రికి రాత్రే టీడీపీ నేతలు పంచుకొని తరలించేశారని సభ్యులు హనుమంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది భారీ వర్షాలతో వేరుశనగ పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతే నేటికీ పరిహారం మంజూరు చేయకపోతే ఎలా అని బిదరకుంతం సర్పంచు హనుమంతప్ప అధికారులను ప్రశ్నించారు. ఎస్.హనుమాపురంలో 'నాడు–నేడు' కింద స్కూల్ నిర్మాణం, ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు అర్థాంతరంగా ఆగిపోయాయని, పనులకు నిధులెన్నీ వచ్చాయి? ఐరన్, కంకర ఇతర సామగ్రి ఏమైనా మిగిలి ఉందా? చెప్పాలని సర్పంచు జయరాంచౌదరి ప్రశ్నించారు.

పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం



పశువుకు చికిత్స చేస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ వెంకటేష్

బొమ్మనహాళ్: గంగవరం గ్రామంలో గురువారం మండల పశు వైద్యాధికారి మంజునాథ్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ వెంకటేష్, శింగనమల పశువైద్యశాల ఏడీ పద్మానాభం, పశుసంవర్ధక శాఖ ఏడీలు రామన్, శైలజ, వైద్యాధికారి శ్రీకాంత్ పశువులకు చికిత్సలు నిర్వహించారు. ఏహెచ్ఏలు మారుతి, ఎర్రిస్వామి, రవికుమార్, అనిల్‌కుమార్, కె.మారుతి, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు పై అవగాహన

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జీఎస్టీ తగ్గింపుపై ఎంపీడీఓ ఉమాదేవి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వినియోగారులకు అవసరాలకు అనుగుణంగా జీఎస్టీ తగ్గించిందన్నారు. అనతరంత జీఎస్టీ తగ్గించిన వస్తువుల వివరాలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మహేష్, రాణీ ఎస్తేర్, రామలక్ష్మమ్మ, జూనియర్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట/బొమ్మనహాళ్: గుమ్మఘట్ట, బొమ్మనహాళ్ మండల కేంద్రాల్లో ఎంపీడీఓలు జయరాములు, విజయభాస్కర్ ఆధ్వర్యంలో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో నిరుపేద, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. జీఎస్టీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్

బొమ్మనహాళ్: మండల పరిధిలోని సింగానహళ్లిలో గురువారం రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్ ఎస్ఐ నబిరసూల్ గ్రామసభ నిర్వహించారు. ఇటీవల జరిగిన దొంగతనాలు ఏ విధంగా జరిగాయి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకొంటే దొంగతనాలు అడ్డుకట్ట వేయవచ్చో తెలియజేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉంటే వారి వలలో నుంచి తప్పించుకోవచ్చన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

గుమ్మఘట్ట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక గురువారం తెల్లవారుజామున అదృశ్యమైనట్లు బాలిక తండ్రి ఎర్రిస్వామి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దుకాణంలో చోరీ



దుకాణం రేకును కోసేసిన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డులోని ఓ రేకులషెడ్డులో ఏర్పాటు చేసిన దుకాణంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. తిమ్మారెడ్డి తన రేకులషెడ్డులో చాలా కాలంగా జనరల్ స్టోర్‌తో పాటు బుక్‌స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం షాపు మూసివేసి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. దొంగలు అర్ధరాత్రి దాటిన తర్వాత షెడ్డుకు ఒక చోట రేకులను కత్తిరించి లోపలకి ప్రవేశించి చోరీ చేశారు. రూ.5 వేలు నగదు, కొన్ని సరుకులు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

యువతి అదృశ్యం

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామంలో ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆదినారాయణ కుమార్తె యు.నిఖిత(19) బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. గురువారం యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు



ఉంతకల్లులో కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: సీఎం చంద్రబాబు మోసానికి బ్రాండ్ అంబాసిడర్. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయటం ఆయన నైజం అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు విమర్శించారు. నేమకల్లు, ఉంతకల్లు గ్రామాల్లో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయనే విషయాలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి అటకెక్కాయని నాయకులు విమర్శించారు. వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్‌లు పరమేశ్వర, ముక్కన్న, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ ఉపాధ్యక్షుడు వెంకటాక్షిపతిరెడ్డి, నాయకులు పయ్యావుల సత్యన్న, కోటేశ్వరరెడ్డి, సూర్యప్రతాప్ రెడ్డి, డాక్టర్ బసప్ప, పెద్దిరెడ్డి, జీఎం నాయుడు, ఉద్దేహాళ్ వన్నూరుస్వామి, రామకృష్ణ, బడిగే వన్నూరుస్వామి, రామాంజి, జయరామ్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, జగదీశ్వరరెడ్డి, తిరుమలరెడ్డి, హరి, నాగరాజు, సురేష్, అంజి, రామంజినేయులు, జగన్, వన్నూరుస్వామి, లింగన్న, చిదానంద, శంకర్, గిరిజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేష్, నరేష్, ఓరెడ్డి, పవన్, లక్ష్మీరెడ్డి, సిద్ధ, జయరామ్‌రెడ్డి, ఉమాకాంతరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఫ్లో ఉన్నన్ని రోజులూ జలవిద్యుత్ ఉత్పత్తి



జలవిద్యుత్ ఉత్పత్తి వివరాలను తెలుసుకుంటున్న డీఈఈ వెంకటరమణ

కూడేరు: పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో ఉన్నన్ని రోజులూ జలవిద్యుత్ ఉత్పత్తి చేస్తామని డ్యాం ఇరిగేషన్ డీఈఈ వెంకటరమణ తెలిపారు. గురువారం ఆయన డ్యాంలోకి హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా వస్తున్న నీటిని పరిశీలించారు. అలాగే ఏపీ జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి విద్యుత్ ఉత్పత్తిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఇన్‌ఫ్లో 695 క్యూసెక్కులుండగా ప్రస్తుతం 820 క్యూసెక్కులకు పెరిగిందన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా 210 క్యూసెక్కులు, జీడిపల్లి జలాశయం నుంచి హంద్రీ–నీవా ద్వారా 610 క్యూసెక్కుల చొప్పున నీరు వచ్చి చేరుతోందన్నారు. పెరిగిన నీటిని జల విద్యుత్ ఉత్పత్తికి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. డ్యాంలో 5.157 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఆయన వెంట జేఈఈలు లక్ష్మీదేవి, ముత్యాలప్ప, గంగమ్మ, రేణుక పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్: గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు తేజశ్రీ, పి.శివానంద, వై.నవ్య, జీ.హర్షియాను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ తిమ్మరాజు, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, వెంకటరాముడు, పవన్, ఎర్రిస్వామి, శిరుద్రప్ప, చాంద్ బాష, మర్రిస్వామి, నాగరాజు, యశోద, సౌదామిని పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఉరవకొండ రూరల్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ అనంతపురం విజన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమక్షంలో క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంశా పత్రాలను అందజేశారు. ప్రొఫెసర్ జయమారుతీ, ఎన్ఎస్ఎస్ పీఓ. వెంకటనాయుడు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ నారాయణ స్వామి, పీఏడీ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎస్సీసెల్ జిల్లా స్థాయి సమావేశానికి తరలిరండి

గుమ్మఘట్ట: జిల్లా కేంద్రంలో ఈ నెల 11న జరిగే ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం నిర్వహించనున్న సమావేశానికి ప్రతి ఒక్కరూ తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నూతన పన్ను చట్టాలపై అవగాహన అవసరం

ఉరవకొండ రూరల్: విద్యార్థి దశ నుంచే నూతన పన్ను చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య, కంప్యూటర్, అర్థశాస్త్ర విభాగాధిపతులు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఆదినారాయణ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతపురం– బళ్లారి జాతీయ రహదారిపై 'ఒకే దేశం–ఒకే పన్ను–ఒకే మార్కెట్ అను నినాదాలతో విద్యార్థులు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో రైతు మృతదేహం లభ్యం



బసవరాజు (ఫైల్)

కణేకల్లు: మండలంలోని మీన్లహళ్లి శివారున హెచ్చెల్సీలో గల్లంతైన రైతు బసవరాజు (32) మృతదేహం గురువారం లభ్యమైంది. తన పొలంలో పప్పుశనగ విత్తేందుకు బుధవారం కూలీలను తీసుకెళ్లిన బసవరాజు.. మధ్యాహ్నం నీళ్ల కోసమని హెచ్చెల్సీ వద్దకు చేరుకుని ప్రమాదవశాత్తు కాలు జారి పడి గల్లంతైన తెలిసిందే. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ముమ్మరంగా గాలించగా గురువారం బిదరకుంతం–దర్గాహొన్నూరు మధ్యలో హెచ్చెల్సీ కాలువలో మృతదేహం లభ్యమైంది. ఆయనకు భార్య ఉమమహేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉమాకు సన్మానం



సీఈసీ సభ్యుడు ఉమాను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఉమమహేశ్వర నాయుడును పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం కురుబ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దురదకుంట దొణస్వామి, పార్టీ నాయకులు బిక్కిహరి, నీరుగంటి సురేష్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మారుతి, టైలర్ శీను, గూబనపల్లి నాగరాజు, మురళి, సాయి, శ్రీకాంత్, ఎరుకుల రమేష్, వడ్డే రమేష్, డీలర్ రాజు, అంకె తిప్పేస్వామి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మనమందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఉమా సూచించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి సత్తి, చౌడన్న,వంశీ, వెంకటేశులు, రామకృష్ణ, హనుమంతు, రామాంజి, మల్లేష్, యల్లప్ప, నరేష్, వరప్రసాద్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

శెట్టూరు: వైద్యపరీక్షల అనంతరం అవసరమైన దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందజేయనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల వద్ద దివ్యాంగ విద్యార్థులకు అలిమ్ కో కంపెనీ, ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల నుంచి దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యారు. ప్రత్యేక అవసరాలగల పిల్లలకు ట్రైసైకిల్, వీల్ చైర్, వినికిడి యంత్రాలు, బుద్ధిమాంద్యపు కిట్లు, రోలేటర్ల అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శెట్టూరు, బ్రహ్మసముద్రం ఎంపీఓలు శ్రీధర్, ఓబుళపతి, ప్రధానోపాధ్యాయుడు ఫిరోజ్‌ఖాన్, భవిత సెంటర్ ఐఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఉపకరణాల నమోదు క్యాంపు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం నమోదు క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ–1 మహమ్మద్ ఇర్షాద్ తెలిపారు. వివరాల కోసం 9515219340, 9110554648, 9550977461 నంబర్లను సంప్రదించాలన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

బొమ్మనహాళ్: స్థానిక పీహెచ్‌సీని తహసీల్దార్ అనిల్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. పీహెచ్‌సీలో కొనసాగుతున్న వైద్య సేవలపై తహసీల్దార్ ఆరా తీశారు. విధులకు హాజరుకాని వారిపై ఉన్నతాధికారులకు రిపోర్టు పంపుతానని తహసీల్దార్ పేర్కొన్నారు. డీటీ మదుసూదన్‌రావ్, ఆర్ఐ నగేష్ బాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.